## ఎస్పీని కలిసిన పర్వతారోహకుడు



ఎస్పీ రాజేశ్‌చంద్రతో పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్

కామారెడ్డి, జూన్ 7 : మహబూబాబాద్‌కు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ ఎస్పీ రాజేశ్‌చంద్రను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. యశ్వంత్ 'హర్ శిఖర్ పర్ తిరంగ' మిషన్‌లో భాగంగా మిజోరాం, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని ఎత్తైన శిఖరాలను విజయవంతంగా అధిరోహించాడు. ప్రతి శిఖరంపై భారత త్రివర్ణ పతాకంతోపాటు ఎస్పీ రాజేశ్‌చంద్ర ఫొటోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యశ్వంత్ సాధన గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరింత ఎత్తైన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## స్పెషల్ టూర్ ప్యాకేజీను సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి, జూన్ 7 : ఈ నెల 27వ తేదీ నుంచి టూరిస్ట్ ప్యాకేజీను ప్రారంభిస్తున్నామని కామారెడ్డి డిపో మేనేజర్ కరుణశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి డిపో నుంచి వరంగల్‌లోని వెయ్యి స్తంభాల గుడి, భద్రకాళి గుడి, రామప్ప దేవాలయం, లక్నవరము చెరువును ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దర్శించుకొని తిరిగి కామారెడ్డికి వస్తారని తెలిపారు. పెద్దలకు ఒక్కరికీ రూ.850, పిల్లలకు రూ.500 చెల్లించాలని తెలిపారు. కామారెడ్డి నుంచి హైదరాబాద్‌లోని బిర్లా మందిర్, సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, జూపార్క్ ఒక్క రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకని, పెద్దలకు ఒక్కరికీ రూ.500, పిల్లలకు రూ.300 ప్యాకేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారం, సెలవు దినాల్లో, గ్రూప్‌గా ఎవరు వచ్చి అడిగినా ఎప్పుడైనా ఈ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

## కూచిపూడి కళాక్షేత్ర వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

కామారెడ్డి, జూన్ 7 : కూచిపూడి కళాక్షేత్రం వార్షికోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని కళాభారతిలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తామని కళాక్షేత్రం వ్యవస్థాపకుడు, జాతీయ నృత్యకళాకారుడు వంశీ ప్రతాప్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటి ఆమని, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ రామకృష్ణగౌడ్, టీవీ నటుడు ప్రభాకర్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాకారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎంబీలు సమర్పించాలి

బిచ్కుంద, జూన్ 7 : పెండింగ్‌లో ఉన్న బిల్లులను బిచ్కుంద మున్సిపాలిటీలో సమర్పించాలని కమిషనర్ షేక్ ఖయ్యూం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గోపన్‌పల్లి, దౌల్తాపూర్, కందర్‌పల్లి పంచాయతీల్లో గతంలో చేసిన పనులకు బిల్లులు రాకుంటే వాటికి సంబంధించిన ఎంబీలను మున్సిపాలిటీలో సమర్పించి కమిషనర్‌ను సంప్రదించాలన్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 07 : జిల్లా వ్యాప్తంగా బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ఉదయమే నూతన వస్త్రాలు ధరించి పెద్దలు, యువకులు, చిన్నారులు ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరులు అలాయ్ బలాయ్ తీసుకుంటూ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పండుగ సందర్భంగా ఇంట్లో ప్రత్యేకంగా తయారు చేసిన శీర్‌ఖుర్మాను సేవించారు. పేద ముస్లిం కుటుంబాలకు దానధర్మాలు చేశారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. జుక్కల్ నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ.. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడు లభించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నీలు పటేల్, వాసర్‌వార్ రమేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలో ముస్లింలు బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి కాంగ్రెస్ నాయకులు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని పలు ఈద్గాలను ఎస్పీ రాజేశ్ చంద్ర పరిశీలించారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బిచ్కుందలో ముస్లింలకు బీఆర్‌ఎస్ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు దేశాయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ డివిజన్ కేంద్రం, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి మండలం శాబ్దిపూర్, లింగంపేట, మహ్మద్‌నగర్, నాగిరెడ్డిపేట, బాన్సువాడ మండలాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఎల్లారెడ్డిలో పండుగ సందర్భంగా ఈద్గావద్ద, పట్టణంలోని పలు కీలక ప్రదేశాల్లో సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్, బీబీపేట, దోమకొండలో ఎస్సైలు ప్రభాకర్, స్రవంతి పోలీస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటుచేశారు. రామారెడ్డిలో బక్రీద్ సందర్భంగా ఎస్సై రాజారాం ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌కు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



బిచ్కుందలో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు





ఎల్లారెడ్డి, మహ్మద్‌నగర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## నరేంద్రచార్య మహరాజ్‌ను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే



దోస్‌పల్లి గ్రామంలో నరేంద్రాచార్య స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద(జుక్కల్), జూన్ 7 : జుక్కల్ మండలంలోని దోస్‌పల్లి గ్రామ శివారులో ఉన్న తెలంగాణ ఉపపీఠంలో జగద్గురు నరేంద్రచార్య స్వామిని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే శనివారం దర్శించుకొని స్వామి వారి ఆశీర్వాదం తీసుకుకున్నారు. అనంతరం ఉప పీఠం సభ్యుల ఆధ్వర్యంలో హన్మంత్ షిండేను నరేంద్ర మహరాజ్ పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస నాయకులు నీలు పటేల్, వాసర్‌వార్ రమేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం

కామారెడ్డి, జూన్ 7 : పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొడుపునూరి మహేశ్ అనే యువకుడు సిద్దిపేట నుంచి కామారెడ్డికి కొన్నేండ్ల క్రితం వచ్చి ఎన్‌జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఒక్కడే కామారెడ్డిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 2వ తేదీ నుంచి అతడికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. తండ్రి తొడుపునూరి జయప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

## పెండింగ్ చలాన్లు చెల్లించాలి

లింగంపేట, జూన్ 7 : వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు చెల్లించాలని ఎస్సై వెంకట్‌రావు అన్నారు. లింగంపేట మండలం మెంగారం గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లను పరిశీలించారు. 21 వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు రూ.11,525 పెండింగ్ చలాన్లను వసూలు చేసినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది మదన్‌లాల్, వసంత్, జవ్వినాయక్ తదితరులు ఉన్నారు.



మెంగారం గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకట్‌రావు

## నాగిరెడ్డిపేటలో భారీ వర్షం..



నాగిరెడ్డిపేటలో కురుస్తున్న వర్షం

నాగిరెడ్డిపేట, జూన్ 7 : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై.. ఈదురుగాలు, మెరుపుతో కూడిన భారీ వర్షం అరగంటపాటు కురిసింది. మండల కేంద్రంలో నూతన రహదారి పనులు కొనసాగుతుండడంతో.. ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచింది. వారం రోజులుగా వర్షాలు లేక ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షంతో పాటు చల్లని గాలులు వీయడంతో ఉపశమనం పొందారు.

## కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్

లింగంపేట, జూన్ 7 : మండలంలోని ఆయా గ్రామాల్లో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఆయా క్లస్టర్లలో విధులు నిర్వహిస్తున్న ఏఈవోలు గ్రామాల్లో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, రిజిస్టర్ మొబైల్ నంబర్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీ అందించాలని సూచించారు. మండలంలోని బాయంపల్లి, పోల్కంపేట, ముంబాజీపేట, కోర్పోల్, లింగంపేట గ్రామాల్లో రైతుల నుంచి వివరాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల రైతులు తమ పేర్లను ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.



పర్మళ్ల గ్రామంలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

## భూమి విషయమై తల్లిదండ్రులకు వేధింపులు

**కొడుకు, కోడలితోపాటు మరోవ్యక్తిపై కేసు నమోదు**

భిక్కనూరు, జూన్ 7: భూమి విషయమై తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్న కొడుకు, కోడలుతోపాటు మరో వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన మర్రి బాగవ్వ- రామయ్య దంపతులకు నలుగురు కుమారులు. తమ పేరు మీద ఐదెకరాల నాలుగు గుంటల భూమి ఉండగా.. ఇందులో నలుగురు కొడుకులకు ఎకరం చొప్పున పంపిణీ చేశారు. మిగితా ఎకరం నాలుగు గుంటల భూమిని తమ పేరుమీద ఉంచుకున్నారు. అయితే వివాహం చేసుకొని నిజామాబాద్‌లో ఉంటున్న వారి మూడో కుమారుడు చంద్రం కాచాపూర్‌కు వచ్చి ఉంటున్నాడు. తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోకుండా వారి పేరిట ఉన్న భూమిని అమ్ముకొని అప్పులు తీర్చేసుకుంటా అంటూ వారిని వేధించసాగాడు. ఇంట్లో నుంచి బయటికి గెంటేసి తాళం వేశాడు. ఇదిలా ఉండగా చంద్రం తన వద్ద అప్పు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఓ వ్యక్తి రామయ్య భూమిలో సాగు పనులు చేపట్టాడు. దీంతో రామయ్య తన కొడుకు, కోడలుతోపాటు తన భూమిలో సాగు పనులు చేపట్టిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**PUBLIC NOTICE**
General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Banswada Branch, Dist. Kamareddy** agreed to accord Loan to **Gottumukkala Venkata Kalyan** S/o Gottumukkula Gantaiah, Age 29 Yrs, Occ: Business, R/o H.No.14-19/8, BC Colony Kotagiri Village, Kotagiri Mandal, Nizamabad (Dist) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(07) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice
**SCHEDULE OF THE PROPERTY**
The existing Open Place lies in Land Sy No.18 (As per Pattadar Pass Book & NALA conversion), Sy No.18/2 (As per Bhu Bharathi) of Mirzapur Village Shivar, situated at Mirzapur Village, Mandal: Kotagiri, District:Nizamabad within the Grampanchayat limits of Mirzapur, Mandal Parishad Kotagiri, Zilla Parishad Nizamabad, under the Jurisdiction of Registration District Nizamabad and Sub District Bodhan Admeasuring: **Plot area 6534.00 Sq.Fts or 726.00 Sq.Yds or 607.00 Sq.Mtrs**
**Bounded as below: East** :: House of Smt Pattabhi, **West** ::Agriculture land of Smt V.Roopa, **North** :: Agriculture land of Smt V.Roopa, **South** :: G.P.Road
**Sd/- R.JAGADISHWER RAO,** Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

# విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



చీనూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో..



కామారెడ్డిలో..

బాన్సువాడ రూరల్/కామారెడ్డి/లింగంపేట/నాగిరెడ్డిపేట/రామారెడ్డి, జూన్ 7 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. బాన్సువాడ మండలంలోని బోర్లం, దేశాయిపేట్, హన్మాజీపేట్, కోనాపూర్, తాడ్కోల్, కొత్తాబాది, సంగోజీపేట్, తాడ్కోల్, బుడ్మి తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ బడి ఈడు పిల్లల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. కామారెడ్డిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బడిఈడు పిల్లల సంఖ్య ఆధారంగా గ్రామీణ ప్రాంతంలో పాఠశాలలను రీ ఆర్గనైజ్ చేయాలని అన్నారు. ఇతర ఆవాసాల నుంచి బడికి రావాల్సిన విద్యార్థుల కోసం ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ వంటి పట్టణాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 10 శాతం కేటాయించాలని అన్నారు. తెలంగాణలో ప్రీ ప్రైమరీ పాఠశాలలకు 5 వేల కోట్లు ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలని కోరారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ పాఠశాలలుగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు మంగ, రాష్ట్ర కమిటీ సభ్యులు ధనమూర్తి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్ గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ బడిబాట కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఐదు సంవత్సరాలు నిండిన బాలబాలికల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్నారులను ప్రైవేట్ పాఠశాలలకు పంపించొద్దని అన్నారు. ప్రభుత్వం చదువుతోపాటు ఉచిత పుస్తకాలు, భోజనం, దుస్తువులను అందిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిష్టయ్య, ప్రసాద్, లావణ్య తదితరులు పాల్గొన్నారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేపడుతున్నట్లు ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, నోట్ బుక్కులు అందిస్తున్నట్లు వివరించారు. మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి, కన్నాపూర్, పోల్కంపేట, లింగంపల్లి తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రామారెడ్డి మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామాల్లోని వీధుల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కన్నాపూర్ గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న 15 మంది విద్యార్థులను ఉపాధ్యాయుడు బాల్‌కిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కన్నాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

## అప్పులబాధ తాళ లేక ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు, జూన్ 7: మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన ఆకారం స్వామి(39) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. ఆకారం స్వామి హైదరాబాద్‌లో భార్యతో కలిసి ఉంటున్నారు. కొన్నేండ్లుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పలు దవాఖానల్లో చికిత్స తీసుకున్నాడు. చికిత్స కోసం తీసుకున్న అప్పులు ఎక్కువయ్యాయి. గత నెల 29న మల్లుపల్లికి వెళ్లివస్తానని చెప్పి ఇంటికి వచ్చాడు. పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపల్లిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ఇందల్వాయి, జూన్ 7: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన తిర్మన్‌పల్లి కిషన్ (40) చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్ శనివారం ఉదయం సిర్నాపల్లి ఊర చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వలను విసరగా.. అది కాళ్లకు చుట్టుకున్నది. దీంతో నీటిలో మునిగి మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శక్కర్‌నగర్, జూన్ 7: బోధన్ పట్టణ శివారులోని చెక్కిక్యాంప్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు చెక్కిక్యాంప్ వద్దకు వచ్చిన రెండు ట్రాక్టర్లను ఆపి అనుమతి పత్రాలు అడుగగా, అందుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సదరు వాహనాలు సీజ్ చేసి తహసీల్ కార్యాలయానికి తరలించారు. ఈ ట్రాక్టర్లు సుంకిని నుంచి వస్తున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

## ఎస్సారెస్పీలోకి 672 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూన్ 7 : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి శనివారం 672 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1062.30అడుగులు(12.904టీఎంసీలు)నీటినిల్వ ఉన్నది. కాకతీయ కాలువకు 100 , మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 341 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.

## రేపు 'దోస్త్' ప్రత్యేక ధ్రువపత్రాల పరిశీలన

డిచ్‌పల్లి, జూన్ 7: తెలంగాణ యునివర్సిటీ పరిధిలో 2025-26 విద్యా సంవత్సరానికి దోస్త్ ప్రత్యేక ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు దోస్త్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా యాక్టివిటీస్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన టీయూలోని అడ్మిషన్స్ కార్యాలయంలో ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్‌తోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

## అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

వినాయక్‌నగర్, జూన్ 7: తాళం వేసిన ఇండ్లతోపాటు పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేస్తూ.. పరారీలో ఉన్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను నిజామాబాద్ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లా చిలుకలవాడ, నిర్మల్ జిల్లా బాసర రైల్వే స్టేషన్ వద్ద నివసించే షేక్ యామిన్ అలియాస్ సమీర్‌తోపాటు ఆదిలాబాద్ జిల్లా తాటిగూడ రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన సయ్యద్ ఫారుఖ్ ఇద్దరూ సుమారు 20కి పైగా చోరీలకు పాల్పడ్డారు. జైలుకు వెళ్లి వచ్చిన అనంతరం మళ్లీ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. వీరు మహారాష్ట్రకు చెందిన సత్య అనే మరో వ్యక్తితో కలిసి బాసరలో గదిని అద్దెకు తీసుకున్నారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు వచ్చి చోరీలకు పాల్పడేవారు. ఈక్రమంలో నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో పార్క్ చేసిన వాహనాలను శనివారం చోరీ చేసేందుకు యత్నించగా పోలీసులు పట్టుకున్నారు. అదుపులోకి తీసుకొని విచారించగా.. ఎడపల్లి, నగరంలోని మూడో టౌన్, జక్రాన్‌పల్లిలోని ఓ బెల్ట్ షాపు లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. మేడ్చల్ జిల్లాకు చెంది మనోహర్ అర్విండ్ ప్రసాద్‌కు చోరీ సొత్తును విక్రయించినట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్‌హెచ్‌వో తెలిపారు. ప్రస్తుతం ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, వారి నుంచి రెండు బైకులు, ఐదు సెల్‌ఫోన్లతోపాటు టీవీని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సత్యం అనే మరో నిందితుడు పరారీలో ఉన్నడని వివరించారు.

## ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

మోర్తాడ్, జూన్ 7: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ వద్ద ఉన్న ఐటీఐలో 2025-26 సంవత్సరానికి గాను మొదటి దశ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రెస్‌మేకింగ్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ట్రేడ్స్‌లో మొదటి దశ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. పదోతరగతి పూర్తి చేసి, 16 ఏండ్లు పైబడిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9491566890, 8106794500 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

**భీమ్‌గల్ ఐటీఐలో..**

భీమ్‌గల్, జూన్ 7: భీమ్‌గల్ పట్టణంలోని ఐటీఐ కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆండాలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 2 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 21వరకు కొనసాగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు htttp// ititelangana government.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు తమ మొబైల్ నెంబర్లతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పట్టణ శివారులోని ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

**FINANCE**
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.